అంగన్వాడీ కేంద్రంలో పోషక మాసోత్సవాలు

కడప అర్బన్: అర్బన్ ప్రాజెక్టు, పాతకడప సెక్టార్, దేవుని కడప అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. పోషణ వేడుకలు చేశారు. గర్భిణులు, బాలింతలను ఆహ్వానించి పోషక విలువపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు గుడ్లు చిరుధాన్యాలు మాంసకృతులు తీసుకోవాలని కేంద్ర నిర్వాహకులు చెప్పారు. జంక్ ఫుడ్స్ తీసుకోకూడదని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పోషికాహారం తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు బి.సునీత, ఎం.అలివేణి, ఆశ వర్కర్లు ఎం.చంద్రకళ కె.గంగాదేవి, ఎం.గంగమ్మ, మహిళలు పాల్గొన్నారు.

మాసోత్సవాల్లో గర్భిణులు, బాలింతలు

సెంట్రల్ ఏసి మరమ్మతుల్లో బొక్కుడు!

- జిజిహెచ్‌లో ఏటా రూ.70 లక్షల చెల్లింపులు
- మూడేళ్ల కిందట ముగిసిన కాంట్రాక్టు గడువు
- పట్టని జిజిహెచ్ పాలనా యంత్రాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిజిహెచ్ ఎమర్జెన్సీవార్డుల్లో సెంట్రల్ ఎసి మరమ్మతుల్లో బొక్కుడు వ్యవహారం జోరుగా సాగిపోతోంది. జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎంఐసియు, ఎస్ఐసియు, ఎస్ఎన్సియు, పిఐసియు, ఎంఎస్ఐసియు ఎమర్జెన్సీ వార్డులు ఉన్నాయి. ప్రతి ఎమర్జెన్సీ వార్డుకు 40 మంది రోగుల చొప్పున 200 మందికి వైద్య సేవలు పొందుతున్నారు. ఇక్కడి రోగులకు అత్యవసర సేవలకు సంబంధించి కార్పొరేట్ తరహా ఖరీదైన వైద్య పరికరాలకు సెంట్రల్ ఎసి తప్పనిసరిగా అవసరం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిజిహెచ్ పాలనా యంత్రాంగం ఎమర్జెన్సీ వార్డులకు సెంట్రల్ ఎసి సదుపాయాన్ని ఏర్పాటు చేసింది. 2015లో ఏటా రూ.15 లక్షల చొప్పున ఐదేళ్లపాటు కాంట్రాక్టరు బాధ్యతల్ని ఓ ఏజెన్సీకి కట్టబెట్టారు. సదరు కాంట్రాక్టరు సెంట్రల్ ఎసికి ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. ఐదేళ్ల వ్యవధిలో జిజిహెచ్‌లోని ఐదు ఎమర్జెన్సీ వార్డులకు చెందిన సెంట్రల్ ఎసి పరికరాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నట్లు సమాచారం. సెంట్రల్ ఎసి పరికరాలను అనివార్యంగా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరువాత సెంట్రల్ ఎసి పరికరాలు మరమ్మతులకు గురవుతున్న నేపథ్యంలో కాంట్రాక్టర్ కొత్త ఎసి పరికరాలను ఏర్పాటు చేయాలని కోరుతూ రిపోర్టును పంపించాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్ సెంట్రల్ఎసి పరికరాలకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతూ ఏటా రూ.15 లక్షల స్థానంలో ఐదు రెట్లు అధికంగా రూ.70 నుంచి రూ.75 లక్షల చెల్లింపులతో కాంట్రాక్టు పనుల్ని కొనసాగిస్తున్నాడనే విమర్శలు వినిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. 2020 నుంచి మూడేళ్లుగా సెంట్రల్ ఎసి మరమ్మతుల పేరుతో భారీ బొక్కుడు వ్యవహారాల్ని కొనసాగుతున్నప్పటికీ జిజిహెచ్ పాలనా యంత్రాంగం కళ్లప్పగించి చోద్యం చూస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. దీనిపై జిజిహెచ్ సూపరింటెండెంట్‌ను సంప్రదించగా సెంట్రల్ ఎసి కాంట్రాక్టర్ మరమ్మతులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని కోరామని పేర్కొనడం గమనార్హం. జిజిహెచ్ పాలనా వ్యవహారాల్ని పర్యవేక్షిస్తున్న కమిషనర్ సెంట్రల్ఎసి మరమ్మతుల బొక్కుడుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే వాదన వినిపిస్తోంది.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

- పోలీసులను అడ్డుపెట్టుకుని పాలన సాగిస్తున్న ప్రభుత్వం
- ఉచిత విద్యుత్ ఎత్తివేయడానికే స్మార్ట్ మీటర్లు
- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో వామపక్ష పార్టీల నాయకులు

కలెక్టర్ వద్ద ధర్నాలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ట్రూ అఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ బిల్లుల భారాలు వ్యతిరేకిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నా కార్యక్రమం ఉద్దేశించి సిపిఎం జిల్లా కారదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ.రాము, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి రమణయ్య, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి) జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి జయవర్ధన్ మాట్లాడారు. విద్యుత్ బిల్లుల మోతతో ప్రజలకు షాక్ కొట్టిస్తున్న ప్రభుత్వ విధానాలు, ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా 2022 కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లు చట్టం తెచ్చిందని విమర్శించారు. ఫిక్స్‌డ్ ఛార్జీలు, సర్వీస్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, ట్రూ అఫ్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ఛార్జీల పేరుతో విద్యుత్ వాడుక బిల్లు కన్నా, ప్రభుత్వ అవసరాల ఆదాయ బిల్లులే ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ యూనిట్ ధర భారీగా పెంచారని, అసలు ఛార్జీల కన్నా కొసరు ఛార్జీలు ఎక్కువగా కస్టమర్ సేవల పేరుతో ప్రజలను నిలువు దోపిడీ పాలక ప్రభుత్వాలే చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ప్రజలపై విద్యుత్ భారాలు మోయలేని విధంగా వేసి అమలు చేస్తున్నారన్నారు. మీటర్ నిర్వహణ ఛార్జీలు విధిస్తున్నారని తెలిపారు. సెల్ ఫోన్లకు ఎలా రీఛార్జ్ చేసుకుంటున్నామో, విద్యుత్ బిల్లులను రీఛార్జ్ చేసుకునే పద్ధతి తీసుకొచ్చి అమలు చేయనున్నారని చెప్పారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణల షరతులు అమలులో భాగంగానే విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి విద్యుత్ ఉద్యమంలో అమరులైనారని, నేటి 23 ఏళ్లయిందని, ప్రజల ప్రాణాలు పోతే తప్ప పాలకులు కళ్ళు తెరవని దౌర్భాగ్య పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. నేటి మోయలేని విద్యుత్తు భారాలు తగ్గేవరకు బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీలు నూటికి నూరు శాతం పెంచి నిర్బంధంగా వసూలు చేస్తున్నారన్నారు. టు అఫ్ ఛార్జీల పేరుతో ప్రజల నుంచి డబ్బు పాలకులు పిండుకుంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2022 విద్యుత్ చట్టం రాకముందే రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం 2021లోనే రూ.3,669 కోట్లు ప్రజలపై విద్యుత్ భారాలు వేసి వసూలు చేసిందని చెప్పారు. విద్యుత్ సంస్కరణలు బిల్లు 2022 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ఆపాలని కోరారు. 18 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేకుంటే 2024 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం శంకర మాన్యాలు ప్రజలు పట్టిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్, ఎ.రామ్మోహన్, ఐ.ఎన్.సుబ్బమ్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులరెడ్డి, దస్తగిరిరెడ్డి, వి.అన్వేష్, సత్యనారాయణ, శ్రీనివాసులు, సిపిఎం నగర నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, బాదుల్లా, సుధాకర్, హేతువాద సంఘం నాయకులు సిఆర్‌వి ప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, లోక్‌సత్తా నాయకులు కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్ పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం 30వ తేదీన చేపట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం చలో విజయవాడ పోస్టర్లను స్థానిక ఐటిఐ కళాశాలలో విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని అన్ని జిల్లా కేంద్రాలలో చలో కలెక్టరేట్‌లు నిర్వహించామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు చేత విద్యార్థి సంఘ నాయకులను, విద్యార్థులను బలవంతంగా అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు రోడ్డెక్కితే సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూడటం దారుణమన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు 7 నెలల మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగునంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచమని అడిగితే ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థులు చదువులు ఎలా కొంసాగించాలని ప్రశ్నించారు. విద్యాసంవత్సరం ప్రారంభమై 4 నెలలు అవుతున్న నాడు నేడు పనులు ఇంకా పూర్తి కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాల విలీనం పేరుతో ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు విద్యార్థులకు అండగా ఉంటానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పూర్తిగా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతం, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు చలో విజయవాడ చేపట్టామని తెలిపారు. విద్యార్థులు వేల సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మనోజ్, నాయకులు చైతన్య, చరణ్, ప్రశాంత్, రెడ్డేయ్య, శ్రీను, సుదీప్, నరసింహ పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం : కలెక్టర్

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-మైలవరం

ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం అందించేలా ప్రభుత్వం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే దిశగా మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్ర వారాల్లో ఒక్కొక్క రోజు ఒక్కో మండలంలో 'జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రభుత్వం ప్రధాన్యత ఇస్తోందన్నారు. గ్రామ స్థాయి సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అయ్యేలా మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. అర్హతలు ఉండి ప్రభుత్వ పథకాలు అందుకోలేని వారు వెంటనే వారి పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ పథకాల లబ్ది పొందాలన్నారు. ప్రజల అర్జీలకు అధికారులు అందించే పరిష్కార నివేదికలు స్పష్టంగా ఉండాలని ఇందులో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు హాజరై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మీటర్ రీడర్స్ కమిటీ పిలుపుమేరకు మీటర్ రీడర్స్ సమస్యలపై ఎస్ఇ కార్యాలయంలో డిఇ టెక్నికల్ నా యకికి శ్రీనివాసులురెడ్డి, యుఇఇయు రాష్ట్ర కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి, యుఇసియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, మీటర్ రీడర్స్ జిల్లా నాయకులు గఫార్ బాషా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్లకు నెల రోజుల పనికల్పించి కనీస వేతనం చట్టబద్ధంగా అమలు చేయా లని కోరారు. స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ ఉపాధికి ప్రమా దం ఏర్పడనున్నదని పేర్కొన్నారు. యాజమాన్యమే నేరుగా వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. కుదించిన పని దినాలను ఉపసంహరించుకోవాలని చెప్పారు. స్పందిస్తూ మీ సమస్యలను సిఎండి దృష్టికి పంపిస్తామని హామీ ఇచ్చారు.

జిపిఎస్ బిల్లు ఆమోదం దుర్మార్గపు చర్య : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలకు వ్యతిరేకంగా జిపిఎస్ బిల్లును శాసనసభలో ఆమోదించడం దుర్మార్గపు చర్య అని, సిపిఎస్ ఉద్యోగులకు చీకటి రోజని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు విమర్శించారు. బుధవారం యుటిఎఫ్ భవన్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి సర్కార్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పి నాలుగున్నరేళ్ళ తర్వాత శాసనసభలో జిపిఎస్ బిల్లును ఆమోదించి, ఉద్యోగులకు ఇచ్చిన హామీని శాసనసభ సాక్షిగా అపహాస్యం పాలు చేశారన్నారని విమర్శించారు. జిపిఎస్ బిల్లును ఆమోదించడం ద్వారా సిపిఎస్ ఉద్యోగుల ఆశలను ప్రభుత్వం చిదిమేసిందని విమర్శించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, కె.నరసింహారావు పాల్గొన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవితాలను అంధకారంలోకి నెడుతూ జిపిఎస్‌ను శాసనసభలో ఆమోదించి రాష్ట్ర చరిత్రలో చీకటిరోజుగా మిగిలిపోతుందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి పేర్కొన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ వేయి కళ్లతో ఎదురుచూస్తున్న సిపిఎస్ ఉద్యోగుల కళ్లలో కారం కొట్టిందని పేర్కొన్నారు.

రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజయం

కడప: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-23 ఇంటర్ జోనల్‌మెన్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టుపై 101 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 364 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ 91, కార్తికేయ హరి కుమార్‌రెడ్డి 74 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని వంశీ నారాయణ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 365 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 263 పరుగులకు ఆల్ అవుట్ అయి ఓటమి చెందింది. ఆ జట్టులోని ఎం.హర్షవర్ధన్ బ్యాటింగ్లో అదుతేంగా రానించి 112 పరుగులు (సెంచరీ) చేశాడు. ఎస్.వి.రాహుల్ 77 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని సి.సిద్ధార్థ 3 టికెట్లు తీసుకున్నాడు.

ఆస్పత్రిలో మలేరియా అధికారి తనిఖీ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మలేరియా సబ్ యూనిట్ అధికారి టక్కోలు నరసింహారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబొరేటరీలో మైక్రో స్కోప్ ద్వారా రక్త నమూనాల పరీక్షించారు. మంచి రక్త నమూనాలను తయారు చేసుకొనే విధానం గురించి తెలిపారు. రక్త నమూనాలు సరిగా లేకపోతే ఫాల్స్ పాజిటివ్స్, ఫాల్స్ నెగిటివ్స్ వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి వెంకట నాగేంద్రతో కలిసి సామాజిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. దోమలు పెరుగుదల ఉండే బ్రీడింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి జ్వరం, తల నొప్పితో వచ్చే వారికీ రక్త నమూనాలను సేకరించి ఎప్పటికప్పుడు పరీక్షించాలని ల్యాబ్ టెక్నీషియన్‌కు తెలిపారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని స్టాఫ్ నర్సులకు, దినసరి కూలీలకు తెలిపారు. కార్యక్రమంలో టిబి ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు, దినసరి కూలీలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-కడప

అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు జన్మదినం సందర్భంగా నగరంలోని ఆదరణ నిరాశ్రయుల వసతి గృహంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిమండలం విజయ్ ఆధ్వర్యంలో బుధవారం కేక్ కటింగ్ చేశారు. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జ తిరుమలేష్, యూత్ కాంగ్రెస్ ప్రొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షుడు వంశీ యాదవ్, జిల్లా ఆర్‌టిఐ చైర్మన్ మావిళ్ళ నరసింహులు, బోస్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రదేశాలను సందర్శించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థులు, ప్రజలు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించాలని పెన్ననర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కె.చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ జిల్లాలో ఎంతో అందమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని చెప్పారు. గండికోట, సిద్ధవటం కోట, పుష్పగిరి ఇలా ఎన్నో ప్రాంతాలున్నాయన్నారు. కార్యక్రమంలో పర్యాటక అభిమానులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, పెన్నన్ల సంఘం కోశాధికారి నగేష్. పాల్గొన్నారు.

సిఎంకు ఎన్‌జిఒ నాయకులు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కడప అర్బన్

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల ఏపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం అసెంబ్లీలో చట్టం ఆమోదించాలని పేర్కొన్నారు. 25 సంవత్సరాల నుంచి రెగ్యులర్ కాకుండా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ విషయం ప్రభుత్వంతో అనేకదఫ్ఫాలు మాట్లాడి ముఖ్యమంత్రిని ఒప్పించి 2014 నుంచి అందరిని రెగ్యులర్ చేయించిన ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ అభినందలు తెలిపారు.

న్యాయ సేవలపై అవగాహన : జడ్జి

ప్రజాశక్తి-కడప

పార్టీలు సెటిల్మెంట్‌కు రాకుంటే, మెరిట్‌ల ఆధారంగా అవార్డులను ఆమోదించేందుకు శాశ్వత లోక్ అదాలత్‌కు న్యాయ నిర్ణేత అధికారం ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో ప్రజా ప్రయోజనత, న్యాయ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలను వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమెన్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఒంటిమిట్ట దేవాలయ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. హరిత హోటల్ యాజమాన్య సహకారంతో వాలంటీర్లు ఒంటిమిట్ట పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో టూరిజం ఆఫీసర్ ఎస్.మల్లికార్జున, రామ్‌కుమార్, టూరిజం క్లబ్, కో-ఆర్డినేటర్ డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, రవి శేఖర్, అరుణ, నాగవేణి పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి-కాశినాయన

దళితులపై దాడులు అత్యాచారాలు అరికట్టాలని సామాజిక న్యాయం కోసం ఈ నెల 29వ తేదీన విజయవాడలో జరిగే కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాల జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఎంబడి పోలయ్య పిలుపు నిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన నరసాపురంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు

నేడు మిలాదున్ నబీ

ప్రజాశక్తి-కడప అర్బన్

మిలాదున్ కమిటీ ఆధ్వర్యంలో పవిత్రమైన మీలాదున్ నబీ ఉత్సవాలను ఈనెల 28వ తేదీ రాత్రి జల్సా ఎ సిరతున్ నబీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని కమిటీ వైస్ ప్రెసిడెంట్, సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, సభ్యులు షేక్ నయీమ్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన మత గురువు మౌలానా మౌల్వి సయ్యద్ షేహబాజ్ అలీ హుస్సేనీ సాబిరి, స్పీకర్‌గా ప్రముఖులు మౌలానా మౌల్వి మహమ్మద్ షాకీర్ హుసేన్ అష్రఫీ, కమిటీ ప్రెసిడెంట్ మాజీ మంత్రి హాజీ మొహమ్మద్ అహ్మదుల్లా హాజరవుతారని పేర్కొన్నారు. కావున ముస్లిం సోదరులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి విజయవంతం చేయాలని తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి - కడప

విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ నెల 28వ తేదీ గురువారం సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని, జిల్లా ప్రజలు విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పవన్‌కుమార్‌కు ఉత్తమ పాత్రికేయ అవార్డు

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ వైఎస్ఆర్ జిల్లాకు చెందిన సాక్షి పాత్రికేయులు పవన్ కుమార్ పంతులుకు పర్యాటక రంగ ఉత్తమ జర్నలిస్ట్ ఎక్సలెన్స్ అవార్డును అందజేసింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన సభలో ఆయన అవార్డును అందుకున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా, రాష్ట్ర ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్ మల్లాది విష్ణు, సెక్రటరీ రజిత్ భార్గవ, రాష్ట్ర అధికారి కన్నబాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు అందజేశారు. పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక వార్తా కథనాలు రాసినందుకు ఆయనకు ఈ అవార్డు దక్కింది. పర్యాటక రంగంలో ఆయన మూడవసారి అవార్డును సాధించడం విశేషం. ఆయనను ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

పరీక్షలకు గడువు పొడిగించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-బద్వేలు

ప్రభుత్వం ఎస్ఐ మెయిన్స్ తుది పరీక్షలకు మూడు నెలలు గడువును పొడిగించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని కోరారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల పోరాట ఫలితంగా వచ్చిన 6511 పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు ప్రభుత్వం పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచి అనేక సమస్యలను సృష్టించి నిరుద్యోగులను గందరగోళానికి గురిచేసిందని తెలిపారు. గడువు పొడిగించలేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మస్తాన్, షరీఫ్, ట్రెజరర్ పి.సురేంద్ర పాల్గొన్నారు.

కెవికెను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఉటుకూరు ను తాడిపత్రి జేసీ దివాకర్ రెడ్డి కాలేజీలో బీఎస్సీ సెకండ్ ఇయర్ చదువుతున్న దాదాపు 35 మంది విద్యార్థిని విద్యార్థులు సందర్శించి కె వి కే సమన్వయకర్త డాక్టర్ వీరయ్యను కలసి వారి నుండి తగు సలహాలు సూచనలు తెలుసుకున్నారు, అనంతరం శాస్త్రవేత్త లక్ష్మీదేవి కె వి కె లో ఉన్నా పలు పైర్లను క్షేత్రస్థాయిలో చూపించి విద్యార్థులకు అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో స్థానిక కెవిపి శాస్త్రవేత్తలు మహేష్ బాబు మరియు జెసి దివాకర్ రెడ్డి అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి-కడప

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

రక్తదానం మరొకరికి ప్రాణ దానమని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణధానమని తెలిపారు. రక్తం దానం చేయడంలో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమానికి అతిథులుగా వైవి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి, డిఎంహెచ్ఒ కార్యాలయం డిస్టిక్ మేనేజర్ భాస్కర్, పివి.ప్రసాద్, పెంచలయ్య, రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్, జిల్లా నెహ్రూ యువ కేంద్ర డైరెక్టర్ వి.మణికంత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శివరామకృష్ణ, డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

గండికోట దేశ చరిత్రకు ప్రతిరూపం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రపంచ పర్యాటక స్థలంగా గండికోట ఉండడమే కాదు.. దేశ చరిత్రకు ప్రతి రూపమని జిల్లా పర్యాటక శాఖాధికారి మల్లికార్జున అన్నారు. బుధవారం గండికోటలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట పర్యాటకుడికి కావలసిన ఆనందాన్ని, ఆహ్లదకర వాతావరణం, చరిత్రను అందజేస్తుందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత గండికోట పేరు ప్రపంచానికి తెలిసేలా మన పాలకులు, ప్రభుత్వం చేస్తుందన్నారు. గండికోట సర్పంచ్ ఎస్.గురుశేఖర్ మాట్లాడుతూ గండికోటకు దేశం నలుమూలల నుంచి వచ్చి వెళుతున్న వారికి మరికొన్ని మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంతకుముందు స్వచ్ఛ భారత్ కార్యక్రమంతోపాటు ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హరిత టూరిజం మేనేజర్ మురళి, సచివాలయం సిబ్బంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీలో డిటిఒ, మేనేజర్, సర్పంచ్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బిదినంచెర్లలో బాల్య వివాహాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చట్ట ప్రకారం వివాహాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బయ్య, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బిసి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బిసి మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిసి సమాఖ్య రాష్ట్ర సెక్రటరీ జనరల్ బడబాగ్ని వెంకట రమణ రాజు డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ బిసి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం కడప జిల్లాలో ఏర్పాటు చేశామని, ఇందుకుగాను విజయవాడ రాష్ట్ర జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ వెంగళరావు ఆధ్వర్యంలో బిసి సమాఖ్యకు చెందిన పలువురు సభ్యులకు వివిధ హోదాలు కల్పించామని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర బిసి సమాఖ్య సెక్రటరీ జనరల్‌గా బడబాగ్ని వెంకటరమణ రాజు, ప్రధాన కార్యదర్శిగా కత్తి విజయ్‌కుమార్‌ను నియ మించినట్లు, కడప జిల్లా గౌరవాధ్యక్షులుగా సందు శివనారాయణ, రామేశ్వరం ప్రభుకుమార్, జిల్లా కన్వీనర్‌గా బడబాగ్ని వెంకటరమణ రాజు, ప్రధాన కార్యదర్శిగా జింక రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా జింక జయప్రకాష్, పాల గిరి సుధాకర్‌రాజు, సంయుక్త కార్యదర్శి రమేష్‌రాజును నియమించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బిసి సమాఖ్య రాష్ట్ర జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

నియామక పత్రాలతో జాతీయ బిసి సంక్షేమ సంఘం సభ్యులు

అవయవదానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అవయవదానం చేయడంతో మరొకరి ప్రాణాలు కాపాడిన వారవుతారని, దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ వైద్యురాలు మల్లేశ్వరమ్మ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్-ఎస్, స్నేహిత అమృత హస్తం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవయదానం-రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చనిపోయాక మనిషి తన శరీరం నుంచి 200 అవయవాలు, కణజాలాన్ని దానం చేయవచ్చు అన్నారు. కళ్లు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులతోపాటు ఇతర అవయవాలు దానం చేయవచ్చు అన్నారు. ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత సగటున ఆరు నుంచి ఏడు మందికి జీవితం ఇవ్వొచ్చన్నారు. చనిపోయే దశలో ఉన్న వ్యక్తికి అవయవ మార్పిడి పునర్జన్మను బహుమతిగా ఇస్తుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, స్నేహిత అమృత హస్తం అధ్యక్షుడు నిమ్మల రాజు, అధ్యాపకులు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రవర్తనపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల ప్రవర్తనపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లాస్మేట్ అకాడమీ హైదరాబాద్‌కు చెందిన ఉమామహేశ్వరరావు బీటెక్ నాలుగో సంవత్సరం విద్యార్థులకు ఏ సందర్భంలో ఎలా వ్యవహరించాలనే దానిపై అవగాహన కల్పించారు. సందర్భాన్ని బట్టి ఎలా మాట్లాడాలిపై కూడా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వసుంధర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్, లారీ ఢీ : ఒకరు మృతి

మరో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని మీర్జాఖాన్‌పల్లె వద్ద బుధవారం ఉదయం తెల్లవారుజామున కడపవైపు నుండి దువ్వూరు వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను ఐచర్ లారీ వెనుక నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో దువ్వూరు ఎస్సీ కాలనీకి చెందిన జేష్టాది రాజేంద్ర (43) మృతి చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. వీరిలో డానియల్, ప్రసాద్, హరి, ట్రాక్టర్ డ్రైవర్ చిన్న హుస్సేన్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ మూర్తి తెలిపారు

మృతి చెందిన జేష్టాది రాజేంద్ర

వేర్వేరు ప్రమాదాల్లో 8 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో వేర్వేరుగా జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వేంపల్లెలోని హనుమాన్ జంక్షన్ సమీపంలో ఆటోను హెచ్‌పి పెట్రోలుకు చెందిన ఆయిల్ ట్యాంకర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కావడంతోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న 6మందికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 ద్వారా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేయించారు. తాటిమాకులపల్లె, కదిరేపల్లె గ్రామాలకు చెందిన 10 మంది వేంపల్లెలో తమ సొంత పనుల నిమిత్తం వచ్చి తిరిగి ఆటోలో వెళ్తుండగా పులివెందుల నుంచి కడపకు వెళ్లుతున్న పెట్రోల్ ట్యాంకర్ ఆటోను ఢీ కొంది. ఆటోలో ఉన్న ప్రసన్న, బోగాదమ్మ, బాలగంగన్న, ఆటో డ్రైవర్ చిన్న, లక్ష్మమ్మతోపాటు మరొకరు గాయపడారు. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించారు. వేంపల్లెలోని గాంధీ రోడ్డులోని తిరుమల థియేటర్ సమీపంలో రెండు మోటర్ బైకులు ఢీ కొన్న సంఘటనలో బిడ్డాలమిట్ట, గరుగువీధికి చెందిన మహమ్మద్ ఉసేన్, ఇనాయతుల్లా తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహమ్మద్ ఉసేన్ అనే యవకుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దె

వర్షానికి కూలిపోయిన మట్టి మిద్దె

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు పట్టణ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో మట్టిమిద్దె పూర్తిగా నేలమట్టమైంది. వర్షాలతో మిద్దె పైనున్న మట్టి తడిసి మంగళవారం అర్ధరాత్రి ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఇంటి యజమానులు అప్పిగాళ్ళ కిట్టయ్య, భార్య నాగమ్మ తమ పిల్లలతో కలిసి ఇంటి వరండాలో పడుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంటిలోని వస్తువులు నాశనమయ్యాయి. దాదాపు రూ.4లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ఇంటి యజమానులు కూలి పనులు చేసుకునేవారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పరామర్శించిన మున్సిపల్ చైర్మన్

వర్షంతో కూలిన ఇంటిని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి బుధ వారం పరిశీలించారు. బాధితుల్ని పరామర్శించారు. తహశీల్దార్‌తో మాట్లాడి ప్రభుత్వం నుండి నష్ట పరిహారం అందిస్తామని చైర్మన్ బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, ఆర్ఒ గంగిరెడ్డి, వైసిపి నాయకుడు ప్రశాంత్, కౌన్సిలర్ ఎరికల్‌రెడ్డి ఉన్నారు.

సచివాలయాల్లో సేవలు అంతంత మాత్రమే

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభతరం చేసి ప్రజల వద్దకే పరిపాలన అందించేందుకు ప్రభుత్వం సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేసింది. శాఖలవారీగా ఉద్యోగులను నియమించింది. ఆ మేరకు సచివాలయాల నుండి ప్రజలకు సేవలు అందడం లేదు. స్థానిక సచివాలయం-1లో ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న వివిధ సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయి. డిజిటల్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లడంతో ప్రభుత్వం నుండి ప్రజలకు అందాల్సిన సేవలు అరకొరగానే ఉంటున్నాయి. ప్రభుత్వం సచివాలయాల ద్వారా ప్రజలకు వివిధ రకాల సేవలు అందిస్తోంది. ఇకెవైసి, రేషన్, రైస్ కార్డు, ఆరోగ్యశ్రీ, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మొదలైన సర్టిఫికెట్లు అందిస్తోంది. ఇందులో ప్రధానంగా ప్రజలకు అవసరమైన ఆధార్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం ఫేస్ యాప్, బయోమెట్రిక్ హాజరు అమలు చేసినా.. సిబ్బంది పని తీరు మాత్రం మారడం లేదు. ఉద్యోగులు ఇళ్ల వద్దనే ఉంటూ పలు రకాలుగా హాజరు వేస్తూ విధులకు డుమ్మా కొడుతున్నారు. సచివాలయానికి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న సచివాలయం సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ, పట్టణాల్లో శాంతిభద్రతలను పరిరక్షించాలి : ఎస్‌పి

ప్రొద్దుటూరు : పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి సిదార్థ్ కౌశల్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గ్రామాలు, పట్టణాల్లో శాంతి భద్రతలు పరిరక్షించాలని ఎస్‌పి సిద్దార్థ కౌశల్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా స్టేషన్‌లలో రిసెప్షనను సందర్శించి, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల వివరాలను ఆరా తీశారు. త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఎస్‌పి సిబ్బందికి సూచించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే చోట కారణాలు గుర్తించి, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎస్‌పి రాజుపాలెం వెళ్లారు. ఆయన వెంట ఎఎస్‌పి ప్రేర్ణకుమార్, వన్ టౌన్ సిఐ రాజారెడ్డి, 2టౌన్ సిఐ ఇబ్రహీం, 3టౌన్ సిఐ నారాయణ యాదవ్, రూరల్ సిఐ రమణారెడ్డి, ట్రాఫిక్ సిఐ యుగంధర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో గౌరవంగా వ్యవహరించాలి

చాపాడు : పోలీస్‌స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే ప్రజలను గౌరవించాలని ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ సిబ్బందికి సూచించారు. చాపాడు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మంచిగా నడుచుకోవాలన్నారు. బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది పని తీరు అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు తగిన సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఐ మైనుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరు : దువ్వూరు పోలీసుస్టేషన్‌ను ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. సిబ్బంది పని తీరును గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సిఐ శ్రీనాథ్ రెడ్డి, పోలీసులున్నారు.

అవార్డు అందుకుంటున్న గువ్వా రాఘవేంద్రరెడ్డి

రాఘవేంద్రరెడ్డికి ఉత్తమ విస్తరణాధికారి అవార్డు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ ఆడిటోరియంలో పులివెందుల ఉద్యానశాఖాధికారి గువ్వా రాఘవేంద్రరెడ్డి ఉత్తమ విస్తరణాధికారి అవార్డు అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎక్స్టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ (ఇఇఐ)సదరన్ రీజియన్, హైదరాబాద్ 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నెక్స్ట్ జనరేషన్ ఎక్స్టెన్షన్ ఫర్ ఎవాల్వింగ్ రీ సైలెంట్ అగ్రి ఎకో సిస్టమ్స్' అనే అంశం మీద జాతీయస్థాయి సెమినార్‌ను బుధవారం నిర్వహించారు. భారతదేశ దక్షిణాది రాష్ట్రాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల్లో ఉత్తమ విస్తరణ సేవలను అందించిన అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. ఎపి ఉద్యాన శాఖ తరపున ఉత్తమ విస్తరణ సేవలను అందించినందుకు గువ్వా రాఘవేంద్రరెడ్డికి అవార్డు ఇచ్చారు. అవార్డును ఎం. జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్ ఇఇఐ హైదరాబాద్, సుధారాణి డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, హైదరాబాద్ డాక్టర్ సదామతేజీ మాజీ వ్యవసాయ ప్లానింగ్ కమిషన్ మెంబర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నానని రాఘవేంద్రరెడ్డి తెలిపారు.

విద్యార్థుల్లో ఉన్నత విలువలను పెంపొందించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థులందరిలో ఉన్నత విలువలను పెంపొందించాలని రాష్ట్రస్థాయి అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎస్.కల్పన సూచించారు. బుధవారం స్థానిక రూరల్ పరిధిలోని తాళ్లమాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో ఎఎంఒ ధనలక్ష్మి, అసిస్టెంట్ ఎఎంఒ రామాంజనేయరెడ్డి, ఎల్ఐపి రాష్ట్ర రిసోర్స్ పర్సన్ వసంత 6,7,8 తరగతిలో బోధించే విధానాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఎనిమిది రకాల జగనన్న విద్యా కానుక వస్తువులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. మంచి బోధన, కథల ద్వారా విలువలతో కూడిన మంచి విద్యార్థులను తయారు చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.గోపీనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు

హోంశాఖ ముఖ్యకార్యదర్శిని కలిసిన 'కాకర్ల'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అమరావతి రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీష్ కుమార్‌గుప్తాను బుధవారం రాయలసీమ పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు కాకర్ల నాగశేషారెడ్డి కలిశారు. మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు అదుపులో ఉండాలని, రామలసీమ ప్రాంతంలో అభివృద్ధికి ఎన్నో వనరులున్నాయని తెలిపారు. ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు బాగుంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని సూచించారని కాకర్ల తెలిపారు. అధికారిని కలిసిన వారిలో రాజుపాలెం మండల వైసిపి కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి ఉన్నారు.

రెండుసార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలి : జెవివి

ప్రజాశక్తి - పొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక పరిధిలోని తాళ్లమాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ప్రొద్దుటూరు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ పోషక విలువలుగల ఆహారాన్ని తీసుకోవాలన్నారు. దంత వైద్యులు డాక్టర్ కుముద, డాక్టర్ చక్రధర్ మాట్లాడుతూ దంతాలు పుచ్చిపోయినా, దెబ్బతిన్నా వారికి ఉచితంగా తమ వైద్యశాలలో తగు చికిత్స చేస్తామని తెలిపారు. ప్రతిరోజు రెండుసార్లు దంతాలను శుభ్రపరుచుకోవాలన్నారు. చాక్లెట్లు తదితర తీపి పదార్థం తిన్న వెంటనే నీటితో పుక్కలించాలని సూచించారు. మురుకుటి సేవా సంస్థ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ ఉచితంగా పేస్టును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి ఎన్.రాజేష్, జిల్లా కో-ఆర్డినేటర్ డివి సుబ్బానాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మహమ్మద్ ప్రవక్త చూపించిన మార్గంలో నడవాలని జమ్మలమడుగు ఆస్థాన ఏ గౌసియా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్ పీరా ఖాద్రి తెలిపారు. హమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భం ఆస్థాన ఏ గౌసియా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్ పీరా ఖాద్రి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్ బాషాతో కలిసి రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. గురువారం మధ్యాహ్నం జమ్మలమడుగు పట్టణంలోని పలగాడి వీధిలో ఉన్న గౌసియా షాదీఖానాలో అన్నదానం ఏర్పాటు చేసినట్లు పీఠాధిపతి తెలిపారు. కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, జహంగీర్‌బాషా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రవక్త జ్ఞాపికలకు గంధోత్సవం

గురువారం మిలాదున్నబి పండుగ సందర్భంగా బుధవారం సాయంత్రం పట్టణంలోని జామియా మసీదులో మహమ్మద్ ప్రవక్త పవిత్ర జ్ఞాపికలకు జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి భక్తులతో కలిసి ఎంతో భక్తిశ్రద్ధలతో గంధోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మహమ్మద్ ప్రవక్త పవిత్ర జ్ఞాపికలకు గంధోత్సవం నిర్వహించి ప్రత్యేక ఫాతిహా నిర్వహించారు. అనంతరం గురువులు, ఫకీర్లు ముస్లింలు, చిన్నారులు ప్రతి ఒక్కరూ ప్రవక్త జ్ఞాపికలకు భక్తిశ్రద్ధలతో గంధోత్సవం నిర్వహించారు. అంతకుముందు పీఠాధిపతి ఇంటిలో ఫకీర్లు మేళ తాళాలతో మహమ్మద్ ప్రవక్తపై కీర్తనలు ఆలపిస్తూ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు ఇర్షాద్ జానీ ఖాద్రి, అసద్ పాషా ఖాద్రి, పీఠాధిపతి సోదరులు, కుటుంబికులు, ముస్లింలు పాల్గొన్నారు.

నేడు మిలాదున్ నబీ ర్యాలీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మిలాదున్నబి సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు అంజుమన్‌అహ్లె ఇస్లాం ఒక కరపత్రంలో తెలిపారు. ఉదయం 9.30గంటలకు మైదుకూరు రోడ్డులోని నజీరుల్లా షా షాదిఖానా నుండి మెయిన్ బజార్, వన్‌టౌన్, గాంధీరోడ్డు మీదుగా ఆషారెషరీఫ్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు పాల్గొన్ని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రంలో కోరారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు

ప్రొద్దుటూరు : ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పెంపుడు కుక్కలకు, పిల్లులకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నామని సహదేవ అనిమల్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటల నుండి మద్యాహ్నం ఒంటి గంట వరకు విజయ నగరం వీధిలోని జీవనజ్యోతి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఎస్ఆర్ఐటికి అటానమస్

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ స్టేటస్ లభించిందని ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి పేర్కొన్నారు. అటానమస్ రావాలంటే పదేళ్లు పూర్తి కావడంతో రికగ్నైజేషన్, ఎన్ఎఎసి, ఎన్‌బిఎ అక్రిడిడేషన్ ఉండి నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు కావలసినన్ని సదుపాయాలు, కళాశాల భవనం, క్లాస్ రూంలు, లేబరేటరీ, డిజిటల్ లైబ్రరీ, విశాలమైన క్రీడా మైదానం ఉండడం వల్లే తమ కళాశాలకు 2023-24 విద్యాసంవత్సరం నుండి అటానమస్ స్టేటస్ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు అటానమస్ స్టేటస్ రావడం గర్వకారణమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

రాయలసీమ జిల్లాల సదస్సును జయప్రదం చేయండి

జమ్మలమడుగు రూరల్ : సామాజిక న్యాయమైన మాదిగల చిరకాల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకు వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న కడపలో రాయలసీమ జిల్లాల మాదిగల విశ్వరూప పాదయాత్రల సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సదస్సులో ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జాతీయ రాష్ట్ర జిల్లా మండల ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

శ్రీనిధి పాల అవుట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శ్రీనిధి పాల సంస్థ అధినేత రేగంటి సురేష్ బాబు, కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా మునిసిపల్ వైస్ చైర్మన్ బంగారు రెడ్డి బుధవారం శ్రీనిధి పాల అవుట్‌లెట్ ప్రారంభించారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొని వారికి శుభా కాంక్షలు తెలిపారు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనిధి పాల సంస్థ డైరెక్టర్ నాగసాయి, జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, టిటిడి మాజీ బోర్డు మెంబర్ మారుతి ప్రసాద్, వైసిపి నాయకులు 11వ వార్డు ఇన్‌ఛార్జి కసిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, రెండో వార్డు నాయకులు గురునాథరెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న బంగారు మునిరెడ్డి

ఎస్‌జిఎఫ్ఐ క్రీడల్లో బీరం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు లోని మేధా డిఫెన్స్ అకాడమీలో ఎస్‌జిఎఫ్ఐ నిర్వహించిన అండర్-19 త్రో బాల్ బాలుర, బాలికల విభాగంలో నిర్వహించిన పోటీల్లో బీరం శ్రీధర్‌రెడ్డి విద్యార్థులు బి.నానికుమార్‌రెడ్డి, తేజేశ్వర్, సి.గంగిరెడ్డి, బి.చరిత, ఎస్.గంగ సాయిశ్రీ, ఆర్.జె.మధు హర్షిణి, సి.జె.నిఖిత గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫుట్‌బాల్ అండర్-19 బాలుర, బాలికల విభాగంలోనూ బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల విద్యార్థులు సుశాంత్, ఉదయ్ ప్రకాష్, శృతి, దీక్షిత అత్యున్నత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం బుధవారం తెలిపింది. స్కూల్ కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ తమ విద్యార్థులు సాధిస్తున్న వరుస విజయాలకు హర్షం వ్యక్తం చేశారు. వ్యాయామ శిక్షణ ఉపాధ్యాయులు ఎ.సురేష్ బాబు, ఎం.బాలసుబ్రమణ్యం, బి.త్రివేణి, ఉమామహేశ్వరి, రాజేంద్రను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేంచందర్, పిఇటిలు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు బాలుర పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రస్థాయి హాండ్ బాల్ పోటీలకు బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రదానోపాధ్యాయులు శివ మునెమ్మ అన్నారు. బుధవారం క్రీడాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శివ మునెమ్మ అభినందించారు. అండర్-17 విభాగంలో ఆదిశేషారెడ్డి, వెంకట శ్రీరామ్, విష్ణువర్ధన్, మహేష్, నగేష్, పునేష్ కుమార్ ఎంపికైనట్లు చెప్పారు. అండర్-14 విభాగంలో శ్రావణ్, నాగచరణ్, సంజయ్, మోహన్‌సాయి, మిథున్ ఎంపికైనట్లు చెప్పారు. అండర్-17లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 29,30, అక్టోబర్ 1తేదీల్లో మూడు రోజులపాటు గుంటూరు జిల్లాలోని తెనాలిలో జరిగే పోటీలకు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవం.. శ్రీరంగనాథుని కల్యాణోత్సవం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో బుధవారం శ్రీరంగనాథుని కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గత వారం నుంచి నూలు పూజ మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పురపాలక చైర్మన్ ప్రసాద్, వైస్ చైర్మన్ వైయస్ మనోహర్‌రెడ్డి, ఎపి పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, పరిపాలనాధికారి రమణ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఆలయ సమీపంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు బుధవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. పట్టణ పరిదిలోని కొత్త అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శ్రీనాథ్ కార్మికులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కార్మికులు నిత్యం అపరిశుభ్రత ప్రాంతంలో పనిచేస్తున్నందు వల్ల వారు తరచూ అనారోగ్యం పాలవుతున్నారని, వారు తప్పక వైద్యపరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలను పాటించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు తరచుగా ఈ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎరుకలరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు కుమార్, ఆర్ఒ గంగిరెడ్డి, సచివాలయం శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేనిరాహార దీక్షలు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం 14వ వార్డు ఇన్‌ఛార్జి మస్తాన్ గోలే, రాజేష్ నాయుడు, రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ సెక్రటరీ, నూర్ బాషా, ఎస్.ఎం బాషా, కరీముల్లా, బషీర్, అక్రమ్, రఫీ, చిన్న దీక్షలో కూర్చున్నారు. మద్దతుగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ డి. విశ్వనాథరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జేబీవుల్లా, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, 28 వార్డ్ లక్ష్మీదేవి, భోగాల లక్ష్మీనారాయణమ్మ, పల్లా లక్ష్మీదేవి, పాణ్యం సుబ్బరాయుడు, మధుబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప అర్బన్ : టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ 'బాబుతో నేను' అనే కరపత్రాల పంపిణీ కార్యక్రమం బుధవారం ఆ పార్టీ కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి నిర్వహించారు. నగరంలోని మేకలదొడ్డి, జెండా చెట్టు వద్ద ప్రజలకు కరపత్రాలు అందజేశారు. అక్రమ అరెస్ట్ దుర్మార్గమన్నారు. అక్రమ అరెస్టును ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ ఖండించాలన్నారు.ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ఓడిపోతారనే భయంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ వైసిపికి బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.

శివాలయాన్ని అభివృద్ధి చేస్తాం

ప్రొద్దుటూరు : పురాతన శివాలయాన్ని నేటి అవసరాలకు అనుగుణంగా మూలవిరాట్‌ను కదిలించకుండా అభివృద్ధి చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక శివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్తపతివారు డిజైన్ చేశాక పబ్లిక్ డొమైన్‌లో పెట్టి చందాలు వసూలు చేసి, ఆధునిక దేవాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.శివాలయానికి చెందిన భూములను 1977-78 కాలంలో కారుచౌకగా తీసుకున్నారన్నారు. ఈ క్రమంలోనే స్థానికంగా ఉన్న డిఎడబ్ల్యు కళాశాల యాజమాన్యం కూడా ఎకరా రూ.10వేలతో 18.10 ఎకరాలు తీసుకొని ఎకరా రూ.20కోట్లతో 11ఎకరాలు అమ్ముకున్నారన్నారు. విద్యాభివృద్ధికి అమ్ముకున్నామని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఈ వ్యవహారం కోర్టులో ఉందన్నారు. ఇలా పట్టణంలో పలు స్థలాలున్నాయన్నారు. దేవాలయం భూములు అనుభవిస్తున్న వారితోపాటు పలువురి దగ్గర చందాలు వసూలు చేసి దేవాలయాన్ని ఆధునీ కరిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు

వేంపల్లె : ఎరువుల దుకాణాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ఆశోక్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం వేంపల్లెలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా పులివెందుల ఎడిఎ అశోక్ రెడ్డి తనీఖీ చేశారు. అలాగే ధరల పట్టిక, ఎరువుల బస్తాలు, తుకాలు, బిల్ పుస్తకాలు, స్టాకు రిజిస్ట్రర్, ఇ-పాస్ మెషీన్ పనితీరుపై దుకాణా దారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ రాజేంద్రప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.